క్లుప్తంగా

మునగాల పంచాయతీ కార్యదర్శి బదిలీ

మునగాల: మునగాల జూనియర్ పంచాయతీ కార్యదర్శి కొల్లు శ్వేత నడిగూడెం మండలం కరివిరాలకు బదిలీ అయ్యారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈమె ఉన్నతాధికారులతో దురుసుగా వ్యవహరించడంతో కొద్దికాలం పాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. అదేవిధంగా శ్వేతపై పలుమార్లు స్థానికులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. కాగా, ప్రస్తుతం ఈమెపై కలెక్టర్ తిరిగి బదిలీ వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. శ్వేతకు రిలీవ్ ఆర్డర్ ఇచ్చినట్లు మునగాల ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ ధ్రువీకరించారు.

ఉత్సవ కమిటీ సభ్యుల నియామకం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి 28 వరకు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులుగా యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, గంగయ్య, నర్సింహ, కవిత, హరీష్‌కుమార్‌చార్యులను రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ నియమించినట్లు నూతన కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువులో శ్రీకంఠమహేశ్వరస్వామి సమేత సురమాంబ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనను గౌడ కులస్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో న్యాయవాదులకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో కోర్టు, జడ్జీల నివాస సముదాయాలకు రామస్వామి గట్టు వద్ద 2.35 ఎకరాల స్థలం కేటాయించినందుకు కృతజ్ఞతగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని న్యాయస్థానం ఎదుట న్యాయవాదులు మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, పలువురు జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 7వ వార్డులో తాగునీటి ఎద్దడి నివారణకు బోరు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరలక్ష్మి నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి

మునగాల : మండల కేంద్రం నుంచి తాడువాయి, తాడువాయి నుంచి మొద్దుల చెరువు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి పంపినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో మంజూరైన బీటీరోడ్ల ఎస్టిమేషన్ కాపీలను రాష్ట్ర మంత్రి, చీఫ్ సెక్రటరీకి అందజేసినట్లు తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

గరిడేపల్లి : ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ కోరారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధి హామీ కూలీకి 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని కోరారు. రోజుకు రూ.600ల కూలి ఇవ్వాన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల వెంకన్న, కోల నాగమని, గుండు వెంకటేశ్వర్లు, నీలమ్మ, శ్రీను, మట్టయ్య, మాజీ సర్పంచ్ కవితరాధా తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా..

అధికారుల ముందస్తు చర్యలు

- గ్రామాల్లో బోర్లు, పైపులైన్లు, చేతిపంపులకు మరమ్మతులు
- నీటి తొట్లను సైతం నింపుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



మంచ్యాతండాలో బోరుకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



చౌటపల్లిలో ట్యాంకర్ సహాయంతో నీటి తొట్టిని నింపుతున్న పంచాయతీ సిబ్బంది

మఠంపల్లి : తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. సాగర్ కాలువకు చివరి ఆయకట్టు అయిన మఠంపల్లి మండలంలో కొన్ని గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో మండల పరిషత్ పాలకవర్గం, అధికారులు తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించారు. గ్రామ ప్రత్యేక అధికారులు.. గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎంపీడబ్ల్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కాగా, మండలంలో సుమారు 400 పైచిలుకు చేతిపంపులు ఉన్నాయి. వాటిలో సుమారు 125 చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం అంతంతమాత్రమే సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిని అందరికీ అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. తాగునీటి బోర్లను, పైపులైన్ల లీకేజీలను యుద్ధప్రాతిపదికన బాగు చేయిస్తున్నారు.

నీటి తొట్లను సైతం నింపుతూ..

కాగా, ముఖ్యంగా రానున్న ఏప్రిల్, మే నెలల్లో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా మండల అధికారులు చర్యలు చేపడుతున్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో అవసరమైతే ప్రైవేటు బోర్లను లీజుకు తీసుకునేందుకు ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీకుంటామని మండల అధికారులు చెబుతున్నారు. అంతేగాక పశువులకు కూడా నీరు అందించేందుకు ఆయా గ్రామాలలో నీటి తొట్లను గ్రామ పంచాయతీల ట్యాంకర్లతో నీటితో నింపుతున్నట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



ఎండలు మండిపోతున్నందున మా గ్రామంలోని ఊరచెరువులో నీరు అడుగంటుతోంది. దీంతో నీటి ఎద్దడి రాకుండా వ్యవసాయ బోర్లను ముందస్తుగా లీజుకు తీసుకొని తద్వారా నీటిని సరఫరా చేయాలి. నీటిఎద్దడి రాకుండా చూడాలి

– తమ్మర శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్, చౌటపల్లి

అధికారులు దృష్టి సారించాలి



మండలంలో అత్యధికంగా 33 గిరిజన తండాలున్నాయి. ఇప్పటికే అనేక తండాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడింది. నీటి సమస్య తీవ్ర కాకముందే ఉన్నతాధికారులు దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– మాళోతు బాలునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు, చెన్నాయిపాలెం

ముందస్తు చర్యలు చేపడుతున్నాం



గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా మందస్తు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే గ్రామాల్లో చేతిపంపులు, బోర్లు, మోటార్లను బాగు చేయిస్తున్నాం. పశువులకు కూడా తాగు నీరందేలా నీటి తొట్లను నీటితో నింపిస్తున్నాం.

– మామిడి జానకిరాములు, ఎంపీడీఓ, మఠంపల్లి

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం



హుజూర్‌నగర్‌లోని ఇందిరా చౌక్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అక్రమంగా అరెస్ట్ చేశారని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కవిత అక్రమ అరెస్టును ఖండిస్తూ బీఆర్ఎస్ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితను ఈడీ అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, అసలు ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఈడీ అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్ నాయక్, కౌన్సిలర్లు జక్కుల వీరయ్య, జక్కుల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ వి.రంగాచారి, నాయకులు పి.శంకర్‌రెడ్డి, బాల వెంకన్న, వీరనాగిరెడ్డి, కె.వెంకటరెడ్డి, శ్రీధర్, జయబాబు, మన్నెం శ్రీనివాసరెడ్డి, సురేష్ బాబు, పిచ్చయ్య కృష్ణ నాయక్, బెల్లకొండ అమర్, అబ్దుల్ నబీ, నగేష్ రాథోడ్, పి.ఉపేందర్, రాంబాబు, చెవుల కవిత, రహీమా, టి.వెంకటరెడ్డి, చెన్నబోయిన సైదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మునగాలలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల నిరసన ర్యాలీ

మునగాల : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేసినందుకు నిరసనగా ఆ పార్టీ వర్గాలు మునగాలలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను ఎదుర్కోలేక రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రలో భాగంగా కవితను అరెస్ట్ చేశారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, పార్టీ మండల సీనియర్ నాయకులు కందిబండ సత్యనారాయణ, సుంకర అజయ్‌కుమార్, తొగరు సీతారాములు, కోల ఉపేందర్, ఎలక వెంకటరెడ్డి, వి.రామిరెడ్డి, వ్రుడుం కృష్ణ, ఎల్.నాగబాబు, గన్నా నరసింహారావు, నవీన్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయాలి

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సంఘ బంధం అధికారులు, పాఠశాలల హెచ్‌ఎమ్‌లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎమ్‌సీ చైర్మన్‌గా సంఘ బంధం అధ్యక్షురాలిని, హెచ్ఎమ్‌ను కన్వీనర్‌గా, తరగతికి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎమ్ దుర్గాప్రసాద్, ఎంపీఓ ఇబ్రహీం, సీసీలు కందుకూరి గురుమూర్తి, స్వరూప, ప్రధానోపాధ్యాయులు, సంఘ బంధం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

మునగాల : మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎస్సీ వర్గాలకు సంబంధించిన అంబేద్కర్ భవనం, కమ్యూనిటీ హాల్ కోల్పోయినందున, తిరిగి నిర్మించేందుకు అనువైన స్థలం కేటాయించాలని అంబేద్కర్ సేవా సమితి సభ్యులు కోరారు. ఈమేరకు శనివారం స్థానిక తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత తహసీల్దార్ కార్యాలయం, లిఫ్ట్ గోదాము స్థలాలు ఖాళీగా ఉన్నందున తమకు కేటాయించాలని కోరారు. అంబేద్కర్ సేవా సమితి సభ్యులు ఎల్‌పి. రామయ్య, ఎల్.నాగబాబు, ఎల్.రాజేష్, గట్టు గురుమూర్తి, యాతాకుల శ్రీకాంత్, వై.రవి, ఎల్.ఈదయ్య, ఎల్.చిన్న, సొంపంగు లింగయ్య, బండారు సుధాకర్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

మోతె : మండలంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను శనివారం తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్ పరిశీలించారు. మోతె, మామిళ్లగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వసతి, సీసీ కెమెరాలు, వెంటిలేషన్, తరగతి గదుల్లో ఫ్యాన్ల ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, మోతెలోని పాఠశాలలో 108 మంది, మామిళ్లగూడెం సెంటర్‌లో 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల చీఫ్ శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, న్యూప్రజ్ఞ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎండి.సలీంషరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని పరీక్ష కేంద్రాల నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం దండు సీతారామరాజు, న్యూప్రజ్ఞ పాఠశాల కరస్పాండెంట్ కాంసాని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

మోతె : నీరందక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రావిపహాడ్, కూడలితో పాటు పలు గ్రామాల్లో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ప్రతినిధుల బృందం శనివారం ఎండిన వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు గంట నాగయ్య, కోట మధుసుదన్‌రెడ్డి, కాకి మోహన్‌రెడ్డి, కిరణ్, సంపెట కాశయ్య, వెంకన్న, శ్రీను ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : దాతల సహకారంతో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ శివప్రసాద్ అన్నారు. శనివారం నేరేడుచర్లలో ఆయన పర్యటించి నేరేడుచర్ల లయన్స్ క్లబ్ నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. కాగా, లయన్స్ క్లబ్ సభ్యుడు రావులపల్లి ప్రసాద్ రూ.70 వేల విలువ గల ఫ్రీజర్ బాక్స్‌ను వైకుంఠాపురం, జానలదిన్న, పత్తేపురం గ్రామాలకు నేరేడుచర్లలో అందజేశారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్ సహకారంతో వికలాంగుడు చిట్టిప్రోలు వెంకటయ్యకు ట్రైసైకిల్ అందజేశారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఎం బాల సైదిరెడ్డికి మైక్ సెట్ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిలకర రామస్వామి, కె. సీతారాంరెడ్డి, శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్‌రావు, క్రాంతికుమార్, సత్యనారాయణరెడ్డి, మధు, సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, మాధవి, విజయలక్ష్మి, సువర్ణ, చిన్నప్ప, సైదులు, శౌరీ, విశ్వనాథ్, రంగారెడ్డి, సైదిరెడ్డి, సైదులు, సురేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



మునగాల : బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ బిందు

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం నుంచి పెన్‌పహాడ్ మండలం చెట్ల ముకుందాపురం వరకు రూ.రెండు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎంపీపీ ఎలక బిందు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ దీనదయాళ్, పంచాయతీరాజ్ డీఈ హర్ష, ఏఈ జువ్వాది రాము, మాజీ సర్పంచ్ ఎర్రం శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవిత, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నడిగూడెం : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు చేపట్టిన సీసీ రహదారి నిర్మాణ పనులను శనివారం జెడ్పీటీసీ సభ్యురాలు బాణాల కవిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి వెంకటరెడ్డి, కాసాని వెంకన్న, గుండు విజయరామారావు, నాగవరపు రాము, శివక్రిష్ణ, తిరుమలి పాల్గొన్నారు.

హుస్సేన్‌బాద్‌లో..

మోతె : మండలంలోని హుస్సేన్‌బాద్‌లో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శనివారం బీఆర్ఎస్ ఎంపీటీసీ ఉషాసంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ నాయకులు కొమ్ము లింగయ్య, భైరపంగు విజయ్, సుందర్, సంజీవరెడ్డి, మండవ యల్లయ్య, మహేష్, సుధాకర్, నర్సయ్య, వెంకన్న, పెదనర్సయ్య పాల్గొన్నారు

భవనాల కూల్చివేతతో ఇబ్బందులు



మండల పరిషత్ కార్యాలయంలో భవనాలను కూల్చివేస్తున్న జేసీబీ

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో తాము కార్యకలాపాలు కొనసాగిస్తున్న భవనాన్ని సమాచారం లేకుండా రాత్రికిరాత్రే కూల్చివేయడంతో 108, 102 సిబ్బంది ఇబ్బందులు పడుతున్నామని 108 వాహనం డ్రైవర్ కీత మధు తెలిపారు. శనివారం హుజూర్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో 108 టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌తో కలిసి ఆయన చెట్టు కింద కూర్చొని భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో ఉన్న భవనాలను కూల్చివేశారని, భవనాల కూల్చివేతతో తమ సామన్లను బయటపెట్టుకుని గత రెండు రోజులుగా రోడ్డుమీదనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నిలువ నీడ లేక చెట్ల నీడలోనే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఆరుగురు సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నామని, రెండు రోజులుగా కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తాగునీరు కూడా లభించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు మండల పరిషత్ కార్యాలయంలో ఒక గదిని కేటాయించాలని డిమాండ్ చేశారు.

కేసుల రాజీతో స్నేహబంధాలు మెరుగు

- సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్



మెగా లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : కేసుల రాజీతో స్నేహబంధాలు మెరుగుపడతాయని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులను, న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ మాట్లాడుతూ ప్రామిసరీ నోటు, డబ్బులు లావాదేవీల కేసులలో ఇరుపక్షాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో 1,850 క్రిమినల్ కేసులు రాజీ అయ్యాయి. కక్షిదారులు వివిధ బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.7 వేల బకాయిలు చెల్లించారు. వివిధ కేసులలో జరిమానా రూ. 4.95 లక్షలను కోర్టుకు చెల్లించగా వాటిని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని జడ్జీలు ఆదేశించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చల్లా కృష్ణయ్య, కమతం నాగార్జున, జుట్టుకొండ సత్యనారాయణ, గొట్టి ప్రశాంత్, పాలేటి శ్రీనివాసరావు, బానోతు శంకర్‌నాయక్, అదనపు పీపీ బొబ్బా కోటిరెడ్డి, ఏజీపీ ఉప్పల గోపాల కృష్ణమూర్తి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎంఎస్ రాఘవరావు, కుక్కడపు నరసింహారావు, కొట్టు సురేష్, వెంకటేష్ నాయక్, శ్రీనునాయక్, రామలక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి, ప్రదీప్తి, రమాదేవి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు, పాల్గొన్నారు.

యాగశాలకు తరలిన దేవతామూర్తులు

- ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



దేవతామూర్తులను ఊరేగింపుగా యాగశాలకు తీసుకెళ్తున్న భక్తులు

కోదాడ : పట్టణంలో రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం బాలాలయం నుంచి దేవతామూర్తులను భక్తులు బొడ్రాయి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను మేళతాళాలతో రామూర్తినగర్‌లో ఏర్పాటు చేసిన యాగశాల వద్దకు శోభాయాత్రగా తీసుకెళ్లారు. యాగశాలలో దేవతామూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపనోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆదివారం ఉదయం 8: 30 గంటల నుంచి జలబిందెల గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మహిళలు జలబిందెలు, ఆవుపాలతో దేవతామూర్తులకు స్వయంగా అభిషేకం చేయొచ్చని పూజారులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

వైద్య విద్యార్థికి రూ.లక్ష ప్రోత్సాహకం



చెక్కు అందజేస్తున్న కాకతీయ కమ్మ సేవా సంఘం సభ్యులు

కోదాడ : పట్టణానికి చెందిన వైద్య విద్యార్థి పిడమర్తి రంజిత్‌కుచదువు ఖర్చుల నిమిత్తం మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణరావు పంపించిన రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని శనివారం కోదాడ కాకతీయ కమ్మ సేవా సంఘం సభ్యులు కోదాడలోని ముత్తవరపు పాండురంగారావు నివాసంలో రంజిత్ తల్లిదండ్రులు పిడమర్తి గాంధీ, లక్ష్మిలకు అందజేశారు. విద్యార్థి నగదును సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎం. పాండురంగారావు, పెదనాటి వెంకటేశ్వరరావు, రావెళ్ల సీతారామయ్య, మేకల వెంకట్రావ్, వేమూరి సురేష్, పోటు రంగారావు, గంటా సత్యనారాయణ, కొత్త బ్రహ్మయ్య, గుళ్లపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



నేరేడుచర్ల : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



మునగాల : నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మునగాల : తెలుగు వారి కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వంగవేటి వెంకటగురుమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రచ్చబండ, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పొట్టి శ్రీరాములు 123వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన గొప్ప త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కాపర్తి మణికంఠకుమార్, కార్యదర్శి చక్కా కిశోర్, ఆర్యవైశ్య పెద్దలు పీవీడి.ప్రసాద్, చిల్లంచర్ల ప్రభాకర్, కుక్కడపు పిచ్చయ్య, చిల్లంచర్ల శ్రీనివాస్, కందిబండ మంగేష్, కందిబండ శ్రీనివాస్, బ్రహ్మదేవర అఖిల్, మద్ది సతీష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో..

నేరేడుచర్ల : తెలుగు రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నేరేడుచర్లలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, లక్ష్మీప్రసన్న, ప్రధాన కార్యదర్శులు జూలూరు అశోక్, చెరుకు కవిత, కోశాధికారులు తాళ్లూరి శ్రీనివాస్, గరినే జ్యోతి, జోన్ చైర్మన్లు కొత్త లక్ష్మణ్, వీరేల్లి శ్రీలత, శ్రీనివాస్‌రావు, నటరాజ్, గోపాలకృష్ణ, పరమేశం ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



మునగాల : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్

మునగాల : విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ అజయ్‌కుమార్ అన్నారు. మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు శనివారం నడిగూడెంకు చెందిన దాతలు ఎనుగుల వినయ్, పందిటి నవీన్‌కుమార్‌లు పరీక్ష ప్యాడ్లను ఎస్ఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీకాళి, సిబ్బంది పాల్గొన్నారు.

గారకుంటతండాలో..

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం గ్రామానికి చెందిన హెచ్ఎన్ నరేందర్‌నాయక్ బ్రదర్స్ సహకారంతో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైదానాయక్, శాంపునాయక్, వెంకట్రాంనాయక్, కోటయ్య, రవీందర్, సందీప్, లకుపతి, బాలు, ఆమని, దివాకర్, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

మునగాల : మండలంలోని ముకుందాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శనివారం జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బాదె అంజి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో బండారు నవీన్, పులగం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రినిటీ పాఠశాలలో..

మండల కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో శనివారం బెతస్థ మినిస్ట్రీస్ సూర్యాపేట వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రసాద్ –కరుణశ్రీ దంపతులు పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. పాఠశాల డైరెక్టర్ ముల్లంగి జానకి వనజ, కరస్పాండెంట్ ముల్లంగి జాకబ్‌రాజ్, ఉపాధ్యాయులు కె.వీరస్వామి, సావిత్రి, శిరీష పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి



మిట్స్ ఫార్మసీ కళాశాలలో జాబ్‌మేళాలో పాల్గొన్న విద్యార్థులు

చిలుకూరు : విద్యార్థులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని మిట్స్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని మిట్స్ ఫార్మసీ కళాశాలలో ప్రముఖ మెడ్‌ప్లస్ రిటైల్ కంపెనీ వారు కళాశాలలో నిర్వహించిన మెగా బాజ్‌మేళాలో వారు మాట్లాడారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కర్షన్ తదితర పద్ధతిలో 24 మంది విద్యార్థులను కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసి, ఉద్యోగ నియామకపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల డీన్ రాములు, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, కంపెనీ ప్రతినిధులు తాజుద్దిన్, శైలేస్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.